APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

మంగళవారం 22-10- 2024

సంపుటి : 15 | సంచిక : 351 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 5 | వెల : రూ. 4 https://expresstelugudaily.com expresstelugudaily

## మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్

### మరోమారు విమర్శలు గుప్పించిన హరీశ్ రావు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. పలు సందర్భాల్లో.. పలు వేదికల్లో మూసీపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను హరీశ్‌రావు గుర్తు చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ. లక్షా 50 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జులై 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సెప్టెంబర్ 6న సీఎం చేతుల మీదుగా విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లోనూ.. రూ. లక్షా 50వేల కోట్లు అంటే సుమారు 18 బిలియన్ల డాలర్లతో ఐదేండ్లలో మూసీ రివర్ ఫ్రంట్ రీడెవలప్‌మెంట్ కొరకు ఖర్చు చేస్తున్నట్లుగా పేర్కొన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు. మొన్న ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ రూ. లక్షా 50 వేల కోట్లు ఎవరన్నారంటూ రేవంత్ ఆవేశంతో ఊగిపోయారు. పూటకో తీరుగా మాట్లాడుతున్న మిమ్మల్ని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది. బిడ్డ పుట్టక ముందే కుల్ల కుట్టినట్లు డీపీఆర్ లేకుండా రూ. లక్షా 50వేల కోట్లు ఖర్చవుతాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుంది. మూసీ రిజువినేషన్ అండ్ రివర్ ఫ్రంట్ పేరుతో ప్రజాధనం లూటీ చేయాలనే మీ కుట్రలను బట్టబయలు చేస్తాం. మీ నిరంకుశ విధానాలను అడుగడుగునా ఎండగడతాం. తెలంగాణ ప్రజల తరుపున నిలదీస్తామని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.




## దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర

# ఎనలేనిది

- ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం
- రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే కీలక బాధ్యత
- శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడి అవకాశాలు
- అమరులైన పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం
- మరణించిన ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు 2కోట్ల వరకు సాయం
- అమరపోలీసులకు నివాళి అర్పించిన సిఎం రేవంత్ రెడ్డి



2లో

## సియోల్‌లో మంత్రుల

# బృందం పర్యటన

### చెత్త తరలింపు..విద్యుత్ ఉత్పత్తిపై పరిశీలన

### అతిపెద్ద ప్లాంట్ పనితీరుపై అధ్యయనం



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రుల బృందం సందర్శించింది. అలాగే అక్కడ చెత్త సేకరణ, మురికి నీటి నిర్వహణ తదితర పద్దతులను కూడా పరిశీలించింది. సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

### మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ.. యధాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ



2లో

### ప్రశాంతంతగా తొలరోజు గ్రూప్-1 పరీక్షలు

అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం



2లో



2లో

## మనదేశంలో ఓ మాదరిగా..వారి దేశంలో మరోమాదిరి

అందుకే దైత్యవేత్తలను కెనడా నుంచి రప్పించాం.. కెనడా తీరుపై అసహనం వ్యక్తం చేసిన మంత్రి జైశంకర్

## బండి, రేవంత్ ఇద్దరూ దోస్తులే

- గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం
- సుప్రీంకోర్టు కేసును తిరస్కరించలేదు
- దీనిపై న్యాయ పోరాటం ఉద్ధృతం చేస్తాం
- విద్యుత్ ఛార్జీలు పెంచితే ఊరుకోం
- మీడియా సమావేశంలో కెటిఆర్ విమర్శలు




**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గ్రూప్-1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. జీవో 29, జీవో 46 తప్పని హైకోర్టులో రుజువు చేయిస్తామని, సమర్థవంతమైన న్యాయవాదితో వాదనలు వినిపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1 అభ్యర్థుల తరపున తమ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,

మిగతా 2లో..

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# బండి, రేవంత్ ఇద్దరూ దోస్తులే

(మొదటి పేజీ తరువాయి)

దాసోజు శ్రవణ్.. పది మంది గ్రూప్-1 అభ్యర్థులతో కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ పిటిషన్ తరపున కపిల్ సిబల్ బలమైన వాదనలు వినిపించారు. పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించలేదు. ఇవాళ పరీక్ష ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఆపడం కరెక్ట్ కాదు. గ్రూప్-1 అభ్యర్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ మీద హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఫలితాలను ప్రకటించొద్దని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. త్వరగా విచారణ జరిపి న్యాయం చేయాలని కూడా సుప్రీంకోర్టు చెప్పిందని కేటీఆర్ తెలిపారు.
కేసీఆర్ నాయకత్వంలో జీవో 55 తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు న్యాయం జరగాలని జీవో 55 తెచ్చాం. ఓపెన్ కోటాలో కూడా రిజర్వ్‌డ్ వారికి అవకాశం కల్పించే విధంగా జీవో 55 తీసుకొచ్చాం. జీవో 29పై తాము జూన్, జులై నుంచి మొత్తుకుంటున్నాం. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రెస్‌మీట్ పెట్టి ఆర్‌ఎస్పీ, దాసోజు శ్రవణ్ పలుమార్లు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖపు వైఖరి వల్ల గందరగోళాల మధ్య పరీక్ష నిర్వహించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 63 పోస్టులకు 30 వేల మంది పోటీ పడుతున్నారు. వారం రోజుల పాటు పరీక్షలు రాయాలి. మనసులో ఎంతో ప్రశాంతత ఉండాలి. కానీ ఈ ప్రభుత్వం వారిని హింసించింది. కోర్టులో కేసు ఉంది.. తెగేదాకా ఆగండి అంటే కూడా కనికరించలేదు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదంటే మేం ఎక్కడ చావాలి అని అడిగారు. పరీక్షలు ఎలా రాయాలని అడిగారు. కొంచెం వాయిదా వేయండని అడిగారు. ధర్నాలు, దరఖాస్తులు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. బలహీన వర్గాలను అణిచివేస్తోంది. జీవో 55కి తూట్లు పొడిచింది. తెలంగాణేతర పిల్లలకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తోంది. హైకోర్టులో కూడా గ్రూప్-1 అభ్యర్థుల తరపున కొట్లాడుతాం. టాప్ లాయర్‌ను తీసుకొస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందే నిరుద్యోగులు. ఇప్పుడేమో వారిని జీవో 29 తీసుకొచ్చి మోసం చేస్తున్నారు. జీవో 46కు సంబంధించిన పిల్లల కోసం కూడా సుప్రీంకోర్టులో కొట్లాడుతాం. గ్రూప్-4లో బ్యాక్ లాగ్ పోస్టులు కానివ్వొద్దని కోరుతున్నారు. ఇకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు రహస్య మిత్రులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ కుర్చీ పోతుంటే బండి సంజయ్‌కు అంత బాధ ఎందుకని ప్రశ్నించారు. బండి సంజయ్ కామెంట్లపై స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలని.. ఖచ్చితంగా బయటకు వస్తాయని కేటీఆర్ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి వార్షికోత్సవం జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. ముత్యాలమ్మ గుడిపై దాడిని తాను ఖండిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. తాను ట్వీట్ చేసినందుకు సైబర్ క్రైమ్ అధికారులు లేఖ పంపారని అన్నారు. రేవంత్‌రెడ్డి లాంటి దగుల్బాజీ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని విమర్శించారు. ఉద్యోగాల కల్పనపై సీఎం రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కంటే జర్నలిస్టులే ఎక్కువ ప్రశ్నించాలని కేటీఆర్ అన్నారు. రేవంత్ ప్రభుత్వం లక్షన్నర కోట్లు మూసీలో పోద్దామంటే చూస్తూ ఊరుకుందామా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్ర పురోగతికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ చార్జీలను రూ.10నుంచి రూ.50కు పెంచాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇప్పటికే కరెంటు కోతలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'రేవంత్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పరిశ్రమలు తెలంగాణ నుంచి తరలిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు పెంచి రూ. 18వేల 500కోట్ల రూపాయల అదనపు భారాన్ని ప్రజలపై ప్రభుత్వం మోపనుంది. చార్జీల పెంపునకు 9ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమమించుకోవాలి. ఇళ్లల్లో వాడుకునే కరెంట్‌కు 300యూనిట్లు దాటితే 10రూపాయలు ఉన్న పిక్స్‌డ్ చార్జిను 50రూపాయలు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల అన్నిటినీ ఒకటే కేటగిరి కిందకు తీసుకురావాలనుకోవటం దుర్మార్గం. కాంగ్రెస్ చేతకానితనంతో ఫాక్స్‌కాన్ పరిశ్రమ తెలంగాణ నుంచి తరలిపోయింది. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యుత్‌లో తెలంగాణ నంబర్ వన్‌గా ఉండేది. ఈనెల 23న ఈఆర్సీ నిర్వహిస్తోన్న పబ్లిక్ హియరింగ్‌కు బీఆర్ఎస్ బృందం హాజరవుతోందని అన్నారు.

# హిందూదేవాలయాలపై దాడులు దుర్మార్గం

- నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వం
- గవర్నర్‌ను కలిసి విన్నవించిన బిజెపి బృందం

**స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హిందూ దేవాలయాల మీద కొంతమంది దాడి చేస్తున్నారని.. దీనిపై ప్రభుత్వం నిమ్మకునీరెతినట్లు వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు ఉపేక్షించడం సరికాదన్నారు. సోమవారం ఉదయం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం నేతలు రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేస్తే నిందితుడిని పిచ్చోడని ముద్ర వేసి వదిలేసే ప్రయత్నం చేశారని ఈటల మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కొంతమంది చేస్తున్నారన్నారు. శాంతియుతంగా ర్యాలీ తీస్తుంటే పోలీసులు దుర్మార్గంగా లాఠీ ఛార్జ్ చేసి అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రదాడులకు నగరంలో ఎంతో మంది బలయ్యారన్నారు. మళ్లీ అలాంటి దాడులకే దుర్మార్గులు కుట్ర చేస్తున్నారని.. నిందితులను కఠినంగా శిక్షించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌ను కోరామన్నారు. పోలీసులే మఫ్టీలో రెచ్చగొట్టి ర్యాలీలో దాడులు, లాఠీఛార్జ్ జరిగేలా చేశారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. హిందూ దేవాలయాల మీద దాడి జరిగితే సీఎం రేవంత్ ఇంత వరకు ఖండించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. హిందూ దేవాలయాల మీద దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిందితుల మీద ప్రభుత్వం కేసు పెట్టకుండా ఏం చేస్తోందని ప్రశ్నించారు. వంద మంది నగరంలో దాడులకు కుట్ర చేసినట్లు తెలుస్తోందని.. రాష్ట్ర ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని నిలదీశారు. 'దేవాలయాల మీద దాడి మా తల్లి మీద దాడిలా భావిస్తాం... తిప్పికొడతాం' అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం బీజేపీ బృందం డీజీపీ ఆఫీసుకు బయలుదేరింది. గవర్నర్ కార్యాలయం నుంచి డీజీపీ ఆఫీస్‌కు ఒకే కారులో ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు వెళ్లారు. ఈ సందర్భంగా నేతలున్న కారును ఎంపీ రఘునందన్ రావు స్వయంగా నడిపారు. కాసేపటికే డీజీపీ కార్యాలయానికి చేరుకున్న తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల బృందం.. డీజీపీ జితేందర్‌ను కలిశారు. ముత్యాలమ్మ గుడి ఇష్యూ, హిందూ సంఘాల లాఠీఛార్జ్ అక్రమ కేసులపై ఫిర్యాదు చేశారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

# దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిది



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసి అమరులైన పోలీసులకు సీఎం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగిస్తూ.. అమరులైన పోలీస్ అధికారులందరికీ ప్రభుత్వం తరపున ఘన నివాళు లర్పించారు. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు పోలీసులే కారణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి పదంవైపు నడవాలంటే పోలీసులు కీలకమన్నారు. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావని.. రాష్ట్రం అభివృద్ధికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.'పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవ ద్దని కోరుతున్నానని అన్నారు. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ఇవాళ డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదని అన్నారు. బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. తీవ్రవాదులు, మావోయిస్టు చేతుల్లో మరణించిన అధికారులను స్మరించుకోవడం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. డ్రగ్స్ మహమ్మారి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. మందిరాల మీద, మజీద్‌ల మీద దాడులు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవల ముత్యాలమ్మ గుడిపై దాడి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శాంతి భద్రతలు తమ చేతిల్లోకి తీసుకునే వారి పట్ల కఠినంగా ఉండాలని తెలిపారు. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుకోవడంలో పోలీస్ సేవలు మరచిపోలేమని కొనియాడారు. జీతం కోసం పోలీస్ సిబ్బంది పనిచేయడం లేదని.. బాధ్యతాయుతంగా భావించి పోలీసులు సేవలు అందిస్తున్నారన్నారు. క్రిమినల్స్‌తో పోలీసులు ఫ్రెండ్లీగా ఉండడం కాదని.. బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. క్రిమినల్స్ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాల కోసం యంగ్ ఇండియా స్కూల్‌ను ఈరోజు ప్రారంభిస్తున్నామన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. ఈరోజు పునాది వేస్తున్నామన్నారు. వచ్చే అకాడమీ నుంచి విద్యా సంస్థ ప్రారంభిస్తామని చెప్పారు. నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహారించాలని స్పష్టం చేశారు. 'పోలీస్ సమస్యలు ఏమున్నా నా దగ్గరికి తీసుకువస్తే నేను పరిష్కరిస్తాను' అని తెలిపారు. వీర మరణం పొందిన పోలీస్ కుటుంబాలకు ఇక నుంచి కోటి రూపాయలు నష్ట పరిహారం అందజేయనున్నట్లు ప్రకటించారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌కు కోటి రూపాయలు, సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీలకు కోటి 50 లక్షలు, ఐపీఎస్ కుటుంబాలకు 2 కోట్లు ఇస్తామని.. అలాగే శాశ్వతంగా అంగవైకల్యం పొందిన కుటుంబాలకు కూడా నష్ట పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఇంతే కాకుండా చనిపోయిన కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.
దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 214 మంది పోలీసులు అమరులు అయ్యారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రవీణ్ అనే కానిస్టేబుల్ అమరుడు అయ్యారని.. వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిందని చెప్పారు. తెలంగాణ పోలీస్ శాఖ శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీపడడం లేదని స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు.. వాటికి కావాల్సిన సౌకర్యాలు అన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీస్ శాఖ ముందు వరుసలో ఉందని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు. తెలంగాణ రాష్టం నుంచి ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసు శాఖ ముందు వరుసలో ఉందని వివరించారు.

# గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వ్‌డుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. మరికొద్ది గంటల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుత దశలో పరీక్షల నిర్వహణలో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. పరీక్షల వాయిదాకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించడంతో దీంతో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తెలంగాణలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల కోసం టీజీపీఎస్సీ పూర్తి ఏర్పాట్లు చేసింది. అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను టీజీపీఎస్సీ ఏర్పాటుచేసింది. అన్ని కేంద్రాల వద్ద ఏవిధమైన అవకతవకలు, అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదాపడుతూ వచ్చింది. దీంతో ఎలాంటి లోపాలు లేకుండా పరీక్షల నిర్వహణకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సీసీ టీవీలను ఏర్పాటు చేసింది. టీజీపీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ టీవీలను పర్యవేక్షించనుంది. పరీక్షల నిర్వహణలో ప్రతి షిఫ్ట్‌లో కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలను అధికారులు జారీచేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకై ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

# ప్రశాంతంతగా తొలరోజు గ్రూప్-1 పరీక్షలు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో తొలిరోజు గ్రూప్-1 పరీక్ష ముగిసింది. పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మెయిన్స్ పరీక్షలు మొదలయ్యాయి. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. పలు చోట్ల పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పోలీసులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. పలుచోట్ల అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని సిబ్బంది పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా గేట్లు తాళం వేయడంతో అక్కడే ఉన్న సిబ్బందిని అభ్యర్థులు చాలాసేపు వేడుకున్నారు. గేటు పట్టుకుని రోదిస్తూ దయచేసి పంపించాలని వేడుకున్నారు. కానీ నిబంధనల ప్రకారం అనుమతించేది లేదని సిబ్బంది చెప్పారు. దీంతో చాలామంది వెనుతిరిగారు. సికింద్రాబాద్‌లోని పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన మాథ్యూస్ అనే అభ్యర్థిని పోలీసులు అనుమతించలేదు. దీంతో గోడ దూకి పరీక్ష కేంద్రం వైపు పరుగులుపెట్టాడు. ఇది గమనించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దుండిగల్‌లో ఓ అభ్యర్థిని పొరపాటున తన పరీక్షా కేంద్రానికి కాకుండా వేరే పరీక్షా కేంద్రానికి వెళ్లింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు సిబ్బంది విషయం తెలుసుకుని ఆమెకు సాయం చేశాడు. వెంటనే ఆమెను తన బైక్‌పై ఎక్కించుకుని సకాలంలో సరైన పరీక్షా కేంద్రం వద్ద దింపాడు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణకు ఉండటంతో పరీక్ష వాయిదా పడుతుందేమోనని అనుకున్నారు.నవంబర్ 20లోగా విచారణ పూర్తి చేయాలని హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్న నేపథ్యంలో.. ఈ దశలో పరీక్షల వాయిదాపై జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో షెడ్యూల్ ప్రకారం గ్రూప్-1 పరీక్షలు మొదలయ్యాయి. పరీక్ష వాయిదా వేయాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. ఎగ్జామ్ హాల్, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించారు. ఇదిలావుంటే పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు నా శుభాకాంక్షలు. ఎటువంటి ఆందోళన చెందకుండా పూర్తి ఏకాగ్రతతో పరీక్షలు రాయండి. ఈ పరీక్షల్లో మీరు విజయం సాధించి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని సీఎం పేర్కొన్నారు.



# మనదేశంలో ఓ మాదరిగా.. వారి దేశంలో మరోమాదిరి

**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన క్రమంలో..తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. అందుకే మన హైకమిషనర్‌తో పాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. 'పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవడాన్ని ఎంచుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బంది కరంగా మారినట్లు కనిపిస్తోంది. అదే భారత్‌లో.. కెనడా దౌత్యవేత్తలు మాత్రం మన సైన్యం, పోలీసుల సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించడం, నిర్దేశిత పౌరులను కెనడాలో అడ్డుకునేందుకు మాత్రం ఎటువంటి చర్యలుండవు ' అని కెనడా తీరుపై జైశంకర్ మండిపడ్డారు. 'అక్కడా, ఇక్కడా వారి తీరు భిన్నంగా ఉంది. భారత్‌కు చెందిన నేతలు, దౌత్యవేత్తలను మీ పౌరులు బహిరంగంగా బెదిరిస్తున్నారు అని మనం చెబితే.. వాక్ స్వాతంత్ర్యం అంటారు. భారత హైకమిషనర్‌ను బెదిరించినా భావ ప్రకటనా స్వేచ్ఛ కింద పరిగణించాలని అంటున్నారు. అదే భారత్‌లోని కెనడా దౌత్యవేత్త సౌత్‌బ్లాక్ నుంచి కోపంతో బయటకు వచ్చారని ఓ భారత జర్నలిస్టు పేర్కొంటే మాత్రం.. విదేశీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. వారి దేశంలో ఒక మాదిరిగా వ్యవహరిస్తాం. విదేశాల్లో అవి మీకు వర్తించవు అని అంటున్నారు. ఇదీ మారుతున్న ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులు' అని కెనడాను ఉద్దేశిస్తూ భారత విదేశాంగ మంత్రి చురకలు అంటించారు. 1945 తర్వాత ప్రపంచంపై పాశ్చాత్య దేశాల ప్రభావం ఎక్కువగా ఉండేదన్న జైశంకర్.. గడిచిన 20-25 ఏళ్లలో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. పాశ్చాత్యేతర దేశాల



వాటా, భాగస్వామ్యం, ప్రభావం పెరిగిందని.. ఈ నేపథ్యంలో వివాదాలు, ఘర్షణలు, వాదనలు సహజమేనన్నారు. ఈ క్రమంలో కొన్ని దేశాల మధ్య సంబంధాలు అంత సాఫీగా ఉండవని విదేశాంగ మంత్రి అంచనా వేశారు.

# చెత్తతో చిత్తడి అయినా బోడియాతండ...!

- సమస్యల వలయంలో తండా వాసులు
- పూడిక తీయరు,దోమల మందు కొట్టరు
- పూడిక తీసినా...బ్లీచింగ్ చల్లరు..!
- చెత్త తీసుకుపోవడానికి ట్రాక్టర్ కూడా రావడం లేదు..!
- సైడ్ డ్రైనేజీ కొత్తవి మంజూరు చేసిన నిర్మాణ%శీ% లేదు...!
- అద్దె భవనంలో గ్రామపంచాయతీ..!
- స్మశాన వాటిక,ఎటు పాయె...!
- డంపింగ్ యార్డ్ చెత్త చెదారం కోసం ఏర్పాటు ఎక్కడ...!
- ఇంట్లో ఉన్న చెత్త వీధి పాలు....!
- అధికారులు ఉన్నారా...లేరా...


అద్దె భవనంలో బోడియతండ గ్రామపంచాయతీ


టపల్లి వెళ్ళు మెయిన్ రహదారి ప్రక్కన మురికి గుంట


స్మశాన వాటిక,డంపింగ్ యార్డు పల్లె ప్రకృతి వనం వెళ్ళే దారి

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అసలే జ్వరాలతో బాధపడుతూ డెంగు, మలేరియాతో,కీళ్ళ నొప్పులతో అనేక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూసుమంచి మండలం బోడియాతండా గ్రామ పంచాయతీ లో సైడ్ కాలువల్లో చెత్త,రాళ్లు, ప్లాస్టిక్ కవర్లు విపరీతమైన చెత్త చెదారం తో నిండి పోయి తీవ్ర వాసన వెదజల్లుతుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారా లేరా అసలే దోమల బెడద రోగాల బారిన పడి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయామని చెప్పినా పాలకులు లేరు పంచాయతి సెక్రటరీ జడేలేదు ఇలాంటి అతిశయోక్తి నుండి ఎలా తప్పుకోవాలి అని ప్రజలు కొట్టుమిట్టు ఆడుతూ ఉంటే కనీసం అధికారులు ఇలా ఉంటే ఏముంది సర్పంచ్ లేరుగా నన్ను ఎవరు అడుగుతారు నేనే రాజు నేనే మంత్రి అనేవిదంగా ఉన్నది.రోగాల బారిన పడిన కుటుంబాలు ఎన్నో ఉన్నా వేడుకున్న శుభ్రం చేయడం లేదు రోజు రోజుకి చెత్త పెరగడంతో సైడ్ డ్రైనేజీ ఫుల్ అవుతుంది.చిన్న పిల్లలు అటుగా వెళ్తే కాలువ లో పడే ప్రమాదం కూడా ఉంది,అంతే కాకుండా ఆ కాలువలు 30,సంవత్సరాలకాల%శీ%లో కట్టించినవి కాబట్టి వాటిని శుభ్రం చేయడం గ్రామ పంచాయతీ సిబ్బందికి అధికారుల నిర్లక్ష్యంతో వాటిని శుభ్రం చేయడం కష్టంగ మారింది.అదే విదంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడినప్పుడు కొత్త గ్రామ పంచాయతీ లు ఏర్పాటాయి గ్రామానికో శాస్మన వాటిక డంపింగ్ యార్డ్ చెత్త చెదారం కోసం ఏర్పాటు చేశారు.కొంతకాలంగా రహదారి ఉండేది.ఈ మధ్యనే ఒక రైతు తన వ్యవసాయ క్షేత్రనికి పోవడానికి దారి లేదు అనీ ఆ రైతు స్మశాన వాటికకు కూడా పోకూడదు అనీ జెసిబి ద్వారా గుంటలు తోవాడు పోవడానికి దారి లేదు, ఇంట్లో ఉన్న చెత్త అంతా గ్రామాలలో బాజార్ల మీదకు కవర్ లు గాలికి పంట పొలాల కు కొట్టుకు పోతున్నవి చెత్త తీసుకుపోవడానికి ట్రాక్టర్ కూడా రావడం లేదు. సైడ్ డ్రైనేజీ కొత్తవి శాంక్షన్ అయినా నిర్మాణ%శీ% చేయడం లేదు.సీసీ రోడ్స్ శాంక్షన్ అయినా వేయటం లేదు,గ్రామ పంచాయతీ బిల్డింగ్ శాంక్షన్ అయినా నిర్మించడం లేదు అద్దె భవనంలో పంచాయతీ కొనసాగుతుంది,గ్రామ పంచాయతీ స్థలం దూరంగా ఉండటంతో ప్రజలకు అందుబాటులో ఉండాలని స్థలము కోసం దాతలు ముందుకు రావాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.అదే విదంగా మంచి నీళ్లు త్రాగటానికి ఒకటే బోరింగ్ తండా మొత్తం ఉదయాన్నే లేచి పనులు మానుకొని బింద్యలు, ప్లాస్టిక్ క్యాన్ తో తీసుకు పోతారు మంత్రి సహాయర్ధంతో ఒక బోరు వేయించగలరని కోరుకుంటూన్నారు.మిషన్ భగీరథ నీళ్ల వాడుకోటానికి వస్తున్నాయి ఈ విషయం పై గ్రామ సెక్రటరీ ద్రుష్టి పెట్టి పై అధికారులకు చెప్పి సమస్యను త్వరగా పరిష్కారం చూపుతారు అని మరియు పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి అయినా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి మా గ్రామాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తారు అనీ గ్రమ ప్రజలు కోరుకుంటున్నారు.



## ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన గడ్కోల్ మాల సంఘం సభ్యులు

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన గడ్కోల్ మాల సంఘం సభ్యులు. సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామ మాల సంఘం సభ్యులు సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తమ సంఘములో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా సంఘ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని సంఘ సభ్యుడు తలారి హేమంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి వెలుమ భాస్కర్ రెడ్డి, మాల సంఘం సభ్యులు మోతిరామ్,తలారి గంగా బాబు, తలారి మధు,తలారి హేమంత్, సుంకరి రాకేష్, నీరడి రాములు, నీరటి స్వామి,తలారి ప్రశాంత్, సుంకరి రాజన్న,సుంకరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## బాలవికాస స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో చేతిపంపు ఏర్పాటు

- కెనడా పేరన్ వుడ్ పాఠశాల విద్యార్థుల సహకారాలతో
- దాహం తీర్చిన కాఫెడ్ సంస్థ

**వాజేడ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రంలో ధర్మవరం, అయ్యవారిపేట పరిధిలో ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని,చిన్నారుల పరిస్థితి తెలుసుకున్న కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ వారు బాల వికాస సంస్థకి తెలియజేయగా తక్షణమే స్పందించిన వరంగల్ బాలవికాస స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో,వెంకటాపురం కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త సహకారాలతో ఎంపీపీ పాఠశాలలో బోరు వేసి చేతి పంపు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ప్రశాంత్ మాట్లాడుతూ..కెనడా దేశంలోని పేరన్ వుడ్ పాఠశాల విద్యార్థుల సహకారంతో ఈ బోర్ వెయ్యడం జరిగింది.అని అయన తెలిపారు. కాఫెడ్ సంస్థ డైరెక్టర్ లూర్ధు రాజు,వాజేడు మండల కోఆర్డినేటర్ జి కామేష్, యానిమేటరు కే.ప్రసాద్,ధర్మవరం హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని బాలవికాస స్వచ్ఛంద సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు.



## సబ్ కలెక్టర్ కు రైతుల గోస పట్టదా...?



- బోధన్ సబ్ కలెక్టర్ పై పోతంగల్ రైతుల ఆగ్రహం
- వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని రైతుల ధర్నా

**బాన్సువాడ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బోధన్ సబ్ కలెక్టర్ కు రైతుల గోస పట్టదా అని పోతంగల్ మండల రైతులు, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతంగల్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పదిరోజులౌతున్నా ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని స్థానిక బీజేపీ నాయకులు,రైతులు సోమవారము మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు హన్మాండ్లు మాట్లాడుతూ..ఆదివారము పోతంగల్ మండల కేంద్రానికి వచ్చిన బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కేవలం మంజీరా నదివద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మాత్రమే తనిఖీ చేసి వెళ్లిపోయారని కోటగిరి నుండి పోతంగల్ మంజీరా నది బ్రిడ్జి వరకు రోడ్డు పొడవునా,రోడ్డు పక్కన పొలాల్లో రైతులు ఆరబోసిన వడ్లు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.కలెక్టర్ కనీసం ఒక్క రైతును పరామర్శించినా బాగుండేదని వాపోయారు.మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ కు రైతుల గోస పట్టటంలేదా అని ఆగ్రహం వక్తం చేశారు.పోతంగల్ లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పది రోజులవుతున్నా ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవటం సిగ్గు చేటన్నారు. వెంటనే కలెక్టర్ పోతంగల్ రైతుల తడిసిపోయిన వడ్లను సైతం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.వడ్ల కొనుగోళ్లు వెంటనే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో స్థానిక రైతులు,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## కొన్న నెల రోజులకే పేలిన ఫ్రిడ్జ్ తప్పిన ప్రమాదం

- భారీ నష్టం జరిగింది అని కన్నీరు పెట్టుకున్న కుటుంబ సభ్యులు



**చౌదాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చౌడాపూర్ మండల పరిధిలోని చాకలిపల్లి గ్రామంలో చెంచు చెన్నయ్య ఇంట్లో నిత్యావసర కూరగాయలు,వంట సదుపాయాలు కుళ్ళిపోకుండా పెట్టుకోవడానికి ఘత నెల రోజుల క్రితం నూతన ఫ్రిడ్జ్ కొనుగోలు చేశారు.సోమవారం చెన్నయ్య కుటుంబ సభ్యులతో పంట పొలానికి వెళ్లగా అతని ఇంట్లో నుండి ఒక్కసారిగా బగ్గుమని మంటలు చెలరేగాయి.చుట్టూ ముట్టు ఉన్న ఇండ్ల వారు చెన్నయ్య ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్రిడ్జ్ నుండి మంటలు చెలరేగి కొద్దీ కొద్దిగా ఇంటికి నిప్పు అంటుకుంది. భారీ నష్టం జరిగింది ఇంట్లో ఉన్న బియ్యం వివిధ వస్తువులు కాలిపోవడంతో బారినష్టం జరిగింది. మమ్మల్ని ఆదుకోండి అని కన్నీరు పెట్టుకున్న కుటుంబ సభ్యులు, చాకలిపల్లి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..చెన్నయ్య కుటుంబ సభ్యులు కూలి పనులు చేసి జీవనం కొనసాగి స్తుండే ఇప్పుడు అప్పులు చేసి ఘత నెల రోజుల క్రిందనే కొత్త ఫ్రిడ్జ్ కొనుగోలు చేశారు.ఇప్పుడు ఫ్రిడ్జ్ పెలడంతో ఇంట్లో వస్తువులు ఇల్లు కూడా పాడైపోయినాయి కాబట్టి బజాజ్ షాపు యాజమాన్యం,అధికారులు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కమ్మర్ పల్లి మార్కెటింగ్ చైర్మన్

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కమ్మర్ పల్లి మార్కెటింగ్ చైర్మన్ పాలెపు నర్సయ్య. ఆదివారం సిరికొండ మండలంలోని కొండాపూర్ సర్పంచ్ తాండ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కమ్మర్ పల్లి మార్కెటింగ్ చైర్మన్ పాలెపు నర్సయ్య అనంతరం ఆయన మాట్లాడుతూ..రైతులు తూకం వేసే దగ్గర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ధాన్యాన్ని సక్రమంగా తూకం వేయాలని సొసైటీ సిబ్బందికి తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాములు,ఏఎంసి డైరెక్టర్ సంపత్ రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు అబ్బాస్,డైరెక్టర్లు మోజీరాం బుచ్చన్న లక్ష్మణ్,సిరికొండ మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు జీవన్ నాయక్,కాంగ్రెస్ బలరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీధర్,వినోద్,జగన్, దిగంబర్, సంతోష్ నాయక్, వీడిసి చైర్మన్ లింబా నాయక్,గౌస్ భాష తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్ హాకీ పోటీలకు ఈ - తక్షిల విద్యార్థుల ఎంపిక




**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి హాకీ ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి లోని డి.ఏ.వి స్కూల్ మైదానంలో %ఖ/14, ఖ% /17 బాల బాలికల హాకీ జట్టును ఎంపిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని ఈ తక్శిల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక ఐనందుకు పాఠశాల కరస్పాండెంట్ శరత్, పి.ఇ.టి శ్రీనాత్ వారికి అభినందనలు తెలిపారు.అందులో నందీశ్వర్,శాన్వి సారిక,విలక్షణ, సాయి లక్ష్మి,హబీబ,శ్రావణి,తేజశ్రీ ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పి.ఈ.టి.శ్రీనాథ్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## జూనియర్ కబడ్డీ స్టేట్ లెవెల్ కు సెలెక్ట్ అయిన జెడ్పిహెచ్ఎస్ గడ్కోల్ విద్యార్థిని

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జూనియర్ కబడ్డీ స్టేట్ లెవెల్ కు సెలెక్టెడ్ అయినా జెడ్ పి.హెచ్.ఎస్ గడ్కోల్ విద్యార్థిని డి.ప్రీతి..68వ ఎస్.జి.ఎఫ్ జూనియర్ కబడి లో ప్రాతినిత్యం వహించి అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లాలోని 14 జోన్ ల నుండి మరియు ఉమ్మడి కామారెడ్డి,నిజామాబాద్ జిల్లాల నుండి స్టేట్ లెవెల్ కు సెలెక్ట్ అయ్యిందని వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్ తెలిపారు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని గడ్కోల్ జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న డి.ప్రీతి ఉమ్మడి కామారెడ్డి నిజామాబాద్ జిల్లాల నుండి స్టేట్ కు సెలెక్ట్ అయిందని ఈనెల 23/10 /2024 నాడు మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ గర్ల్స్ కబడ్డీ పోటీలలో ప్రీతి పాల్గొననుందని అన్నారు.విద్యార్థిని మనస్ఫూర్తిగా అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షిస్తున్నామని జెడ్పిహెచ్ఎస్ గడ్కోల్ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్,లక్ష్మారెడ్డి,ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు.



# విచ్చల విడిగా అక్రమ కల్లు దుకాణాలు

- అనుమతి లేకుండానే అమ్మకాలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఎలాంటి అనుమతులు లేకుండానే కల్లు దుకాణాలు విచ్చల విడిగా ఏర్పాటవుతున్నాయి. ఏ ప్రాంతంలో అయిన కల్లు దుకాణం ఏర్పాటు చేయాలంటే తప్పని సరిగా ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా ఓ గ్రామంలో ఒక దుకాణం ఏర్పాటు చేసేందుకు ఫర్మిషన్ తీసుకుని అదనంగా మరో రెండు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. పర్యవేక్షిం చాల్సిన ఎక్సైజ్ అధికారులు వ్యాపారులు ఇచ్చే అమ్యామ్యాలకు ఆశపడి చూసీచూడ నట్లుగా వ్యవహ రిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం,కల్లు దుకాణదారులను ప్రోత్సహించేందుకు రాయితీలు అందిస్తున్న విషయం తెలిసిందే. కానీ,గౌడ వృత్తిని నమ్ముకుని నమ్మకంగా కల్లును విక్రయి స్తున్నారు. ఈ వ్యాపారంలో కూడా కొందరు అక్రమ వ్యాపారులు జొరబడి వారి లాభాల కోసం అనుమతి లేకుండా యథేచ్ఛగా కల్లు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.అల్లాదుర్గం మండలంలో ఇటీవల కాలంలో పర్మిషన్ లేకుండా అక్రమంగా కళ్లు దుకాణం అక్రమిస్తున్నాను. లాభార్జనే ధ్యేయంగా గ్రామాల్లోని అమాయక ప్రజల జీవితాలతో ఆటలాడుకునేందుకు మత్తుకోసం కల్లులో అల్ప్రాజోలం కలుపుతూ కల్లుకు బానిసలను చేస్తున్నారు. రోజు తప్పనిసరిగా వారు తయారు చేసిన కల్లునే తాగేలా అలవాటు చేశారు. దీంతో ప్రజలు ఆరోగ్యాలు పాడైపోతున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు అనుమతి లేని కల్లు దుకాణాలపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### అనుమతిలేని కల్లు దుకాణాలు ఏర్పాటు..

అల్లాదుర్గం ఓ వైపు గ్రామీణ ప్రాంత ప్రజల అలవాట్లను ఆసరా చేసుకున్న కల్లు వ్యాపారులు గ్రామాల్లో అనుమతి లేని కల్లు దుకాణాలు ఏర్పాటు చేశారు.ఒక దుకాణం ఏర్పాటుకు లైసెన్స్ తీసుకుని దాని పేరుతో రెండు మూడు దుకాణాలు ఎలాంటి లైసెన్స్ లు లేకుండానే ఏర్పాటు చేసుకున్నారు. ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో అల్లాదుర్గం ప్రియులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అల్లాదుర్గం నుండి వట్టిపల్లి వెళ్లే రోడ్డు పక్కన అక్రమ కలూ దుకాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మార్గాల్లో అదే విధంగా జాతీయ దారి పక్కన వద్ద కూడా ఎలాంటి అనుమతి లేకుండానే కల్లు విక్రయాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు, ,ఎలాంటి అనుమతులు లేకుండా కల్లు దుకాణాలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు జరుగుతుంటే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. గౌడవృత్తిదారులు తమ జీవనోపాధికోసం చెట్లు ఎక్కి కల్లును గీసి విక్రయిస్తుంటే లాభార్జనే ధ్యేయంగా గౌడ కులస్తులు కాకపోయినా కూడా. వారు కల్తీ కల్లును తయారీ చేసి విక్రయిస్తున్నారు. యథేచ్ఛగా కల్లు డిపోలు ఏర్పాటు చేసుకుని అనుమతి లేని కల్లుదుకాణాలకు కల్లును సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతు న్నారు. అయినా కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపో నడం వల్ల యథేచ్ఛగా అనుమతి లేని కల్లు దుకాణాలు వెలుస్తున్నాయి. అక్రమ కల్లుదుకాణాలపై పలువురు ఫిర్యాదు చేస్తే వారిని వ్యాపారులు, అధికా రులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిపై గ్రామాల్లో అడ్డుకున్న వారికి ఎంతో కొంత ముట్టజెప్పి వారి నోళ్లు మూయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు అనుమతి లేని కల్లు దుకాణాలపై చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేకుండానే కల్లు దుకాణాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా అల్లాదుర్గం మండలంలో పలు గ్రామాలలో అక్రమ కలూ దుకాణాలు పాటు 161 జాతీయ రహదారి పక్కనే అల్లాదుర్గం మండలం లో అనుమతి లేని కల్లు దుకాణాలు ఏర్పాటు చేశారు. కల్లు దుకాణదారులు కల్లును ప్యాకెట్ల ద్వారా మాత్రమే విక్రయిస్తారు. ఎక్కడో తయారు చేసిన కల్లును ప్లాస్టిక్ కవర్లలో నింపి వాటి ద్వారా కల్లు విక్రయిస్తున్నారు.

# పోలీస్ అన్న..సేవలకు సలాం....!





- శాంతి భద్రత పరిరక్షణలో వారే కీలకం
- ప్రజలకు రక్షణ కల్పించడంలో ముందు
- విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయరు
- పోలీస్ అమరుల సేవలు మరువలేనివి
- కామధేను జూనియర్ కళాశాల విద్యార్థులు

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పోలీస్ అన్న.. సేవలకు సలాం సిరికొండ మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల స్మరణ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సిరికొండ ఎస్ఐ ఎల్.రామ్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ లో భాగంగా పాఠశాల మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులకు పోలీస్ స్టేషన్ లో పోలీసులు నిర్వహిస్తున్న విధుల గురించి సంబంధిత పరికరాల గురించి వివరించడం జరిగింది.అనంతరం ర్యాలీ నిర్వహించి తెలంగాణ చౌరస్తాలో మానవహారం నిర్వహించి పోలీసు అమరవీరులకు ఒక నిమిషం మౌనం పాటించారు.మరియు కామధేను కళాశాలలో వ్యాసరచన పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను సిరికొండ ఎస్ఐ రామ్ అందించారు. అనంతరం ఎస్ఐ ఎల్.రామ్ మాట్లాడుతూ..పోలీస్ అమరవీరుల దినమును ఎందుకు జరుపుతారో విద్యార్థులకు వివరిస్తూ పోలీసులు ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రజలు పోలీసులకు సహకారం అందించాలి.కాలుష్యం బారిన పడి చనిపోతున్నారు. పోలీసులకు కూడా సుఖవంతమైన సౌకర్యవంతమైన జీవితం గడిపే విధంగా చూడడమే మన కర్తవ్యం అని అన్నారు. పోలీసులు తమ విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లు ఎదురుకొని విధులు నిర్వహిస్తుంటారు.ధర్మాన్ని, సత్యాన్ని,న్యాయాన్ని కాపాడుతూ..ధైర్యంగా శత్రువులని తీపి కొడతారు.తమ విధులలో భాగంగా రాత్రంతా మేలుకొని శాంతి భద్రతలను పర్యవేక్షిస్తారు.ఎండ, చలి,వాన,రాత్రి, పగలు,అని తేడా లేకుండా ప్రజల కోసం నిరంతరం కాపలా ఉంటారు.ఈ క్రమంలో అనేకమంది పోలీసులు వీరను మరణం పొందారు. 1959 అక్టోబర్ 21న పంజాబ్ రాష్ట్రానికి చెందిన డి.ఎస్.పి కమర్షింగ్ ఆధ్వర్యంలో 21 మందితో కూడిన సిఆర్పిఎఫ్ గళం భారత్ చైనా సరిహద్దుల్లో గస్తీ తిరుగుతోంది. ఇదే సమయంలో చైనా బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాయి మన సిఆర్పిఎఫ్ దళం వారిని దీటుగా ఎదుర్కొని ఈ ఘర్షణలో పదిమంది భారత జవానులు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలను గౌరవిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల స్మరణ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఎస్ఐ ఎల్.రామ్ విద్యార్థులకు సూచించారు. వారి త్యాగాలకు గుర్తుగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు జరుపుకొని దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఆసవులు బాసిన పోలీసులకు ఏటా నివాళు లర్పిస్తారు. నిరంతరం విధి నిర్వహణలో దేశానికి కాపాడేవారు సైనికులు అయితే అంతర్గత శక్తుల నుంచి ప్రజలను కాపాడి వారి ధన ప్రాణాలకు భద్రత కల్పించేది పోలీసులు సామాజిక ఆస్తుల రక్షణ వారి బాధ్యతే, పోలీసుల విధులు భిన్నంగా ఉంటాయి,ఎప్పుడు అప్రమత్తంగా ఉంటారు.అని విద్యార్థులకు వివరించారు.తదనంతరం విద్యార్థులు పోలీస్ అన్న సేవలకు సలాం. శాంతి భద్రత పరిరక్షణలో వారే కీలకం. ప్రజలకు రక్షణ కల్పించడంలో ముందు. విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయరు. పోలీస్ అమరుల సేవలు మరువలేనివని పోలీసులకు అన్నింటిలో సహకరిస్తామని మీరు చేస్తున్న విధినిర్వహణ గొప్పదని, మీరు చెప్పిన మాటలు ద్వారా తెలుసుకున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిరికొండ ఎస్ఐ ఎల్. రామ్,హెడ్ కానిస్టేబుల్లు మధుకర్, జీవన్,కరుణ,కానిస్టేబుళ్లు రాకేష్, దేవేందర్,గౌతమి,మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రుణమాఫీ చేసి,వానాకాలం, యాసంగికి రైతు భరోసా,పంటల బోనస్ రైతాంగానికి ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్





**హైదరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రూ.2లక్షల లోపు రుణమాఫీ, వానాకాలం , యాసంగికి రైతు భరోసా, బోనస్ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ ఇచ్చిన హామీలు నెరవేరక రైతాంగం ఆందోళన చెందుతున్నారు.తక్షణం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రదానకార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటి సమావేశం మూడ్ శోభన్ అధ్యక్షతన సంఘం రాష్ట్రకార్యాలయంలో జరిగింది. అనంతరం సాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతాంగానికి ద్రోహం చేసిందని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని ఎదురుచూశారు.వానకాలం పంటల సీజన్ ముగిసినా రైతులకు ఇచ్చిన హామీలు రుణమాఫీ,రైతు భరోసా,బోనస్ ఆచరణలో అమలు కాలేదు. రైతాంగం అప్పులు తెచ్చి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు ఆగాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇప్పటి వరకు రుణమాఫి సగం మందికి మాత్రమే అమల్కెంది. రైతు భరోసా వానకాలం సీజన్‌కు డబ్బులు ఇప్పటి వరకు రైతుల ఖాతాలో జమకాలేదు. ఇటీవల వ్యవసాయ శాఖామంత్రి మాట్లాడుతూ..క్యాబ్‌నెట్‌లో నిర్ణయం చేస్తామని అంటున్నారు. ఇది సరైంది కాదు. ఇప్పటికే ఆలస్యమైంది తక్షణమే రైతు భరోసా వాన కాలం సీజన్ డబ్బులను రైతుల ఖాతాలో వేయాలి. వరి రూ.500, మక్కజొన్న రూ.330, కందులు రూ.400, సోయ రూ.450, పత్తిరూ.475, చెరుకు రూ.850, జొన్నలు రూ.308 క్వింటల్ పంటలకు బోనస్ కలిపి ధరలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు. ఆచరణలో అమలు జరగడంలేదు. కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం విడ్డూరం. దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ చెల్లించాలి.ఈ సమస్యలతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు.ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాధ్‌రావు, మాదినేని రమేష్, వీరెపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు లెల్లెల బాలక్రిష్ణ,కందాల ప్రమీల, మాటూరి బాల్‌రాజ్‌గౌడ్,యం.డి గఫూర్‌పాష,శెట్టిపల్లి సత్తిరెడ్డి, యం.శ్రీనివాస్‌లు,పల్లపు వెంకటేష్, యండి. సర్ధార్, చింతల రజినీకాంత్,భూక్య చందు నాయక్, పరమేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

# వట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొప్పుల లక్ష్మి శేషారెడ్డి



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అందోల్ నియోజక వర్గంలోని వట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొప్పుల లక్ష్మి శేషారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు ఈ కమిటీని ప్రభుత్వం ఖరారు చేసింది. వైస్ చైర్మన్ గా మన్నె ఈశ్వరయ్య తో పాటు16 మంది డైరెక్టర్లను ప్రభుత్వం నియమిం చింది. సందర్భంగా చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను మార్కెట్ కమిటీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.చైర్మన్ ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కమిటీకి సహకరించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అల్లాదుర్గం గ్రామంలోకి వెళ్లే రోడ్డు బాగు చేయించాలని ప్రజావాణిలో వినతి




**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జాతీయ రహదారి నుండి అల్లాదుర్గం గ్రామం లోకి వెళ్లే రహదారిని బాగు చేయించాలని అల్లాదుర్గం నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షులు బ్రహ్మం, ప్రజావాణిలో సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..అల్లాదుర్గం ఎన్హెచ్ 161 జాతీయ రహదారి కమాన్ నుండి గ్రామంలోకి వెళ్లే బిటి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడంతో వాహనదారులు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన రెండు వరుసల ఈ రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో బీటీ రోడ్డును రెన్యువల్ చేసేలా ప్రభుత్వానికి నివేదించాలని తాసిల్దార్ కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

# రైతు భరోసా ఇవ్వని కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో బొంద పెట్టాలి

- మర్పల్లి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమ్మరి గూడెం కృష్ణ



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని మర్పల్లి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమ్మరి గూడెం కృష్ణ పత్రికా ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు.అదేవిధంగా కెసిఆర్ రైతులకు పెట్టుబడి సాయంగా సంవత్సరానికి 10000 చొప్పున రైతు బంధు ఇచ్చి ఆదుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఎకరాకు 15000 రైతు భరోసా 100 రోజుల్లో ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇవ్వకుండా భూములు సాగు చేసే రైతులకు మాత్రమే ఇస్తామని అదికూడా వచ్చే యాసంగి పంటకు ఇస్తామని అనడం గతంలో కేసిఆర్ అన్నట్లు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు బంధుకు రామ్ రామ్ అన్నట్లే అని,సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు.

# షికారి పేటకు చెందిన శివ సింగ్ మృతికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూరు పట్టణంలోని షికారి పేటకు చెందిన టిడిపి కార్యకర్త శివసింగ్ అనారోగ్య కారణంగా మరణించడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య,శివ సింగ్ పార్థదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యాన్ని ఇచ్చారు.ఎమ్మెల్యేతో పాటు క్లస్టర్ ఇంచార్జ్ మూర్తుజావాలి,జాను,తదితరులు పాల్గొన్నారు.

# మేకల,గొర్రెలకు నట్టల నివారణ మందులు వేస్తున్న ఎమ్మెల్యే

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొర్రెలలో మరియు మేకలలో నట్టల ల నివారణ మందు వేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తజయసూర్య పాల్గొని గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందునువేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాంద్ర సురేంద్రనాథ్ రెడ్డి,సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, కురువ వెంకటేశ్వర్లు,సున్నంపల్లి శ్రీనివాసులు మరియు అధికారులు తదితర గొర్రెల పెంపక దారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



